క్లుప్తంగా

లిఫ్ట్ ఇచ్చి.. చైన్ స్నాచింగ్

సుద్దపల్లి(చేబ్రోలు): గుర్తుతెలియని యువకుడు బైక్‌పై వచ్చి.. మహిళను బెదిరించి, బంగారు గొలుసు అపహరించిన ఘటన సుద్దపల్లి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. సుద్దపల్లి గ్రామానికి చెందిన పోతురాజు సాంబ్రాజ్యం మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీలో ఉద్యోగినిగా పనిచేస్తోంది. డెయిరీ నుంచి ఇంటికెళ్లేందుకు బుధవారం రాత్రి వడ్లమూడి క్వారీ దేవాలయం సమీపంలోని రోడ్డు వద్ద నిలబడింది. గ్రామంలోకి వెళ్తున్నానని చెప్పిన గుర్తుతెలియని యువకుడు..ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. రైల్వే గేట్ సమీపంలో బైక్ ఆపి ఆమెను బెదిరించి, మెడలో ఉన్న సుమారు రూ.1.40లక్షల విలువ చేసే నాలుగున్నర సవర్ల బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. పోతురాజు సాంబ్రాజ్యం ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

5న ప్రభుత్వ కళాశాల భూముల కౌలు వేలం

చేబ్రోలు: చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వ్యవసాయ భూములకు హై కోర్టు ఉత్తర్వుల మేరకు కౌలు వేలం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సుచరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13.55 ఎకరాల మాగాణి, మెట్ట భూమికి జూన్ 5 మధ్యాహ్నం 2.30 గంటలకు కమిటీ ఆధ్వర్యంలో కౌలు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. మంచాల గ్రామంలోని సర్వే నంబరు 106లోని 2.11 ఎకరాలు, చేబ్రోలు సర్వే నెంబరు 916, 235, 909/2, 426/2, 760/3లోని 11.44 ఎకరాలకు కౌలు వేలం స్థానిక కళాశాలలో జరుగుతుందన్నారు. కళాశాల కార్యాలయంలో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చునని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటన చేబ్రోలులో గురువారం జరిగింది. వివరాల మేరకు.. చేబ్రోలు ప్రాంతానికి చెందిన వి.బసవపున్నయ్య బైక్‌పై వస్తుండగా సినిమా హాలు ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బసవపున్నయ్య కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 2వ లైనులో నివసించే సునీల్ చంద్రయ్యనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వెళుతుంటాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న ఇంట్లోని బాలికతో పరిచయం పెంచుకున్నాడు. బుధవారం తన పుట్టిన రోజు అని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను ఇంటి సమీపంలో వదిలిపెట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈపూరుకు చెందిన వెంకట నరసింహారావు కుమార్తె జి.శ్రీప్రణీత (20) గుంటూరు విద్యానగర్‌లోని బంధువుల ఇంట్లో ఉండి ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. చదువులో వెనుకబడడంతో మానసికంగా కుంగిపోయి ఈనెల 7న ఎలుకల మందు తిని, కుటుంబ సభ్యులకు ఆలస్యంగా చెప్పింది. ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలి

లక్ష్మీపురం: పోస్టల్ రంగంలో అతి పెద్ద యూనియన్‌గా ఉన్న నేషనల్ ఫెడరేషన్‌ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్(ఎన్ఎఫ్‌పీఈ) గుర్తింపును పునరుద్ధరించాలని కోరుతూ నగరంలోని శంకర్ విలాస్ సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకు గురువారం సాయంత్రం భారీ ప్రదర్శన నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పోస్టల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాల్ని వ్యతిరేకిస్తూ పలు ఉద్యమాలు చేస్తున్న ఎన్ఎఫ్‌పీఈ గుర్తింపును అప్రజాస్వామికంగా రద్దు చేయడం కార్మిక సంఘాల హక్కుల్ని కాలరాయడమేనని తెలిపారు. సహేతుకమైన కారణాలు చూపకుండా కేవలం రైతుల ఉద్యమానికి, సోదర సంఘాల ఉద్యమాలకు ఆర్థికంగా సహాయపడ్డారనే నెపంతో యూనియన్ గుర్తింపును నిరాకరించడం ప్రజాస్వామ్య పద్ధతుల్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గుర్తింపును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాల మనుగడను దెబ్బతీస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాల్ని ఏకపక్షంగా రద్దు చేసి నూతన లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాల్ని ఐక్య పోరాటాల ద్వారా ఎదుర్కొంటామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు, పెన్షనర్స్ తరపున ఎం.రామకృష్ణ, టి.వి.జి.రవిశంకర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- చేబ్రోలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితీ అధ్యక్షతన గురువారం జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లోకి అడుగు పెట్టగానే..రోడ్ల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని, శానిటేషన్ సిబ్బందికి కార్యదర్శులు తగిన సూచనలు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎస్‌డబ్ల్యూసీ షెడ్డులో చెత్త వేసే విధంగా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. రెవెన్యూ శాఖ నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని పనితీరు మెరుగుపరుచుకోవాలని తహసీల్దారు కె.సుజాతకు సూచించారు. పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ నాయక్ పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు చేసిన వాటికి ఎంబుక్‌లు చేయకపోవటం, బిల్లులు చేయటంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఏఈపై చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన జొన్న పంట రైతులు ప్రతి ఒక్కరికీ నష్ట పరిహారం అందజేయాలని కోరారు. వేజండ్ల పీఏసీఎస్ సొసైటీ ద్వారా మొక్కజొన్నను క్వింటా రూ.1962లకు కొనుగోలు చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు తెలిపారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కిలారి సూచించారు. బిల్లులు పెండింగ్ లేకుండా వెంటనే వస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను స్థానిక సర్పంచ్‌ల అనుమతితో చేపట్టాలని స్పష్టం చేశారు. ఫీల్డు అసిస్టెంట్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని దీని దృష్ట్యా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. అప్పాపురం చానల్‌పై ఉన్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలను తొలగించాలని ఇరిగేషన్, పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలం అనే బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీలు పసుపులేటి శ్రీనివాసరావు, కాసు అనిత, ఎంపీడీఓ బి.బాబురావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి

- ఎంపీపీ పులగం దివ్య
- గుంటూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దివ్య, ఇంచార్జ్ ఎంపీడీవో

గుంటూరు రూరల్: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషిచేసి మండలాభివృద్ధికి పాటు పడదామని గుంటూరు రూరల్ మండలం ఎంపీపీ పులగం దివ్య పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రూరల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జ్ ఎంపీడీవో శోభారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి సందర్భంగా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నాణ్యత లోపాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీపీ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు స్థానికంగా ఉన్న సచివాలయం సిబ్బంది కృషి చేయాలని, అందుకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు ఉన్నతాదికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం మండల స్థాయిలోని వివిధ విభాగాల అధికారులు గతంలో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఏ విధంగా సద్వినియోగించుకోవాలో ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలో జొన్నలగడ్డ, చిన్నపలకలూరు, మల్లవరం తదితర గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఇంటూరి పద్మావతి, దర్శి సుజాత, ఎంపీటీసీ రమేష్, సర్పంచ్‌లు నల్లమేకల అప్పమ్మ, ఏరువ పద్మావతి, మాధవరావు, రాంజీ అబేడ్కర్, జగన్‌మోహన్‌రెడ్డి, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్ పుస్తకం ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య ఈ. శ్రీనివాస రెడ్డి రాసిన 'సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్' పుస్తకాన్ని గురువారం వీసీ ఆచార్య పి రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయి లో ప్రయోజనకరమైన పుస్తకాన్ని ఏఎన్‌యూ అధ్యాపకుడు రాయడం అభినందనీయమన్నారు. రచయిత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గేట్, ఐఈఎస్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. సులభతరమైన అంశాలతో విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. బీఎస్ పబ్లికేషన్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం తాను ఇప్పటికే ఆరు పుస్తకాలు, రెండు వ్యక్తిత్వ వికాస కథా సంకలనాలు రాశానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ర్యాంకింగ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ బీహెచ్. నాగకిశోర్, సీఈ నరసారెడ్డి, వికాస అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, శ్రీనివాసరావు, యూఈ కుమార్ రాజు, డీఈ అప్పారావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి..


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

పెదకాకాని: ఉపాధి కూలీలకు గతేడాది రూ.12,88,686ల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. కొప్పురావూరు గ్రామంలో గురువారం ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈమని అప్పారావు మాట్లాడుతూ.. పనిచేసిన వారికి సకాలంలో వేతనాలు చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని అధికారులను ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే నిధులు తగ్గించడం, రెండు పూటలా పని విధానం తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన సదుపాయాలను కూడా తీసివేశారని, ఎక్కడా కూడా మెడికల్ కిట్లు, టెంట్లు, పలుగు, పారకు డబ్బులు ఇవ్వకపోవడం.. దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీలకు రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. లేకపోతే మే 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయూ నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నగరంపాలెం: ఆర్.అగ్రహారంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త వెంకటబుచ్చిరామశాస్త్రి, కార్యనిర్వాహణాధికారి పగడాల శివకోటేశ్వరరావు, ధర్మకర్తల మండల సభ్యులు ముత్తురాజు, కె.శ్రీవల్లి, శికుమారి, 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం

పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు రెండో రోజుకి చేరాయి. గురువారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ప్రభాత సేవ, ఆలయ ప్రదక్షిణలు, ఆకు పూజలు, తీర్థ గోష్ఠి, ప్రసాద వినియోగం నిర్వహించారు. తొమ్మిది గంటలకు శ్రీ వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, కోశాధికారి గ్రంధి కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

12 సవర్ల బంగారం, మూడు కిలోల వెండి, రూ.లక్ష నగదు అపహరణ


బీరువా ఖాళీ చేసిన దుండగులు


పరిశీలిస్తున్న సీఐ బండారు సురేష్‌బాబు

పెదకాకాని: ఇంటికి గేటు వేసి ఉండటాన్ని గుర్తించి, తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన వెంకటకృష్ణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన కంచర్ల నాగేశ్వరరావు వ్యక్తిగత పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 9న బనగానపల్లె వెళ్లాడు. ఇంటికి తలుపులు వేసి ఉండటాన్ని కనిపెట్టిన గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి, సుమారు 10 సవర్ల బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలు, లక్ష రూపాయలు నగదు దోచుకెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు ఇంటికి చేరుకున్న యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది.

అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరి అరెస్టు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి

గుంటూరు ఈస్ట్: సెంట్రల్ జీఎస్టీ అధికారులమంటూ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు నిందితుల్ని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌లో గురువారం వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెంట్రల్ జీఎస్టీలో గుమస్తాగా పనిచేసే జి.వెంకటబాబు, స్నేహితుడ్ని వెంటబెట్టుకుని ఈనెల 6వ తేదీ బ్రాడీపేట 6/14లోని గేమ్ వరల్డ్ షాపునకు వెళ్లారు. యజమాని షేక్ ఖాజాను తాము సెంట్రల్ జీఎస్టీ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. వెంకటబాబు తీసుకొచ్చిన ద్విచక్ర వాహనంపై జీఎస్టీ అని రాసి ఉండటంతో ఖాజా అధికారులని నమ్మాడు. ఇద్దరు జీఎస్టీ చెల్లించాలని బెదిరించారు. ఖాజా అందుకు ఒప్పుకొని రూ. 1700 చెల్లించాడు. అనంతరం ఇద్దరు షాపులోని బ్లూటూత్‌ను అడిగి తీసుకుని వెళ్లారు. ఖాజా నిందితులు వచ్చిన ద్విచక్ర వాహనం నంబరు నోటు చేసుకుని అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు వెంకటబాబు, అతని అనుచరుడు దార్ల సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. గురువారం ఇద్దరిని అరెస్టు చేసి రూ. 1700తో పాటు బ్లూతూత్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఈ కేసులో వాటి ఆధారంగానే నిందితుల్ని గుర్తించామని తెలిపారు.

తాగునీటి సరఫరాపై అశ్రద్ధ వద్దు



నెహ్రూనగర్: నగరంలో తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు రాకుండా ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులు పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించాలని, సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆమె గురువారం వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఆవుల సంరక్షణ కేంద్రం, వెంకటరమణ కాలనీలో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. తొలుత వెంగళాయపాలెంలో నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ని పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ, నగరానికి సరఫరా మార్గంపై ఇంజినీరింగ్ అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వెంగళాయపాలెం చెరువులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడానికి, మోటార్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. చెరువు పూర్తిస్థాయిలో నీటితో ఉంటేనే నగరంలోని ఏటీ అగ్రహారం, హౌసింగ్ బోర్డ్ తదితర రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేయగలమని చెప్పారు. చెరువు నింపేందుకు ఎస్ఎస్‌పీ కెనాల్ ఆధారం కనుక ఇరిగేషన్ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో వీధి ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, వాటికి సకాలంలో ఆహారం అందించేలా చూడాలని తెలిపారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. అనంతరం వెంకట రమణ కాలనీలో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించారు. ఎస్ఈ భాస్కర్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ సంధ్యారాణి, వీఏఏలు

పెదకాకాని: రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్న, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి పి.సంధ్యారాణి అన్నారు. పెదకాకాని, ఉప్పలపాడు గ్రామాల్లో ఇటీవల అకాల వర్షాలకు తడిసిన జొన్న, మొక్కజొన్న పంటను గురువారం రైతులతో కలసి ఏఓ పరిశీలించారు. పంట నష్టం అంచనా వేయడం ప్రారంభించినట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో వర్షానికి దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్నలు వాటి నాణ్యత పరిశీలించి, కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 16 నుంచి ఆయా గ్రామాల పరిధిలో పంట నష్టం అంచనా, బాధిత రైతుల జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శించడం జరుగుతుంన్నారు. రైతులు ఎలాంటి అభ్యంతరాలున్నా తెలియజేయాలని కోరారు. పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఆ ధరకు కొనుగోలు చేస్తుందని రైతులకు తెలిపారు. పంట నష్టం అంచనాకు వీఆర్వోలు, వీఏఏలు పొలాలకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభం రోజే.. 'కానుక' కిట్లు పంపిణీ


జగనన్న విద్యా కానుక కిట్లు పరిశీలిస్తున్న డీఈఓ శైలజ

కాకుమాను: పాఠశాలల పునః ప్రారంభం రోజునే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరిన జగనన్న విద్యా కానుక కిట్లను గురువారం డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు తల్లిదండ్రులపై భారం పడకుండా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న విద్యా కానుక ద్వారా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూ, సాక్సులు, బెల్ట్ వంటి అనేక రకాల వస్తువులను ఉచితంగా అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్లను ఒక్కో వస్తువుకు ఒక గది ఏర్పాటు చేసి భద్రపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏపీసీ జి.విజయలక్ష్మి, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ జె.రవి, ఎంఈఓ కేఎఫ్ కెనడీ, హెచ్‌ఎం టి.జోషమేరి,సిబ్బంది ఉన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు


ప్రత్యేక పూజలో మంత్రి అంబటి, సురేష్

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే గ్రామ దేవత పోలేరమ్మతల్లి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం చిన్న పలకలూరు గ్రామంలో పోలేరమ్మ తల్లి 6వ వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఇన్‌కం టాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్, తాడికొండ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ కత్తెర సురేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడారు. గ్రామంలో ప్రజలంతా ఐక్యమత్యంగా బ్రహోత్సవాలను ఘనంగా నిర్వహించటం శుభపరిణామమన్నారు. పోలేరమ్మతల్లి ఆశీర్వచనాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం తీర్థ ప్రసాదం, మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఇంద్ర ఆలయ పూజారులు ముఖ్య అతిథులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. గ్రామ ప్రజలు తోట నాగేశ్వరరావు, ముల్లపూడి వెంకటేశ్వర్లు, దాసరి నాగరాజు, వంగా నవీన్‌రెడ్డి, తోట బాలకృష్ణ, శ్రీనివాసరావు, బందలపాటి భాస్కర్, నరేష్, కాకి శ్రీను పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి


తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఓ కిరణ్మయి

బోడిపాలెం(కాకుమాను): ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన మొక్కజొన్న, జొన్న పంటలను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకుని మద్దతు ధర పొందాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. బోడిపాలెం, గరికపాడు, తెలగాయపాలెం, బీకే పాలెం గ్రామాల్లో గురువారం తడిసిన మొక్కజొన్న పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. క్వింటాకు మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధర రూ.1,962లు చెల్లించనున్నట్లు వెల్లడించారు. అలాగే వర్షాలకు మొక్కజొన్న, తెల్లజొన్న పంటలు దెబ్బతిన్న రైతులు వీఏఏలను సంప్రదించి పంట నష్ట పరిహారం కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కనీసం 33శాతం పంట నష్టం వాటిల్లిన ప్రతి రైతు పేరు నమోదు చేయనున్నట్లు ఏఓ తెలిపారు .ఆమె వెంట వీఏఏలు కె.సౌమ్య, జె.హస్సీరత్న, డి.షణ్ముఖ, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వాలి: ఫ్యాప్టో


డీఈవో శైలజకు వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు అప్పగిస్తున్న వివిధ రకాల పనుల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజకు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. వేసవిలో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా వేర్వేరు కార్యక్రమాల్ని అప్పగించి, పాఠశాలల్లోనే ఉండాలని అధికారులు ఒత్తిడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్టాల్ బాలికోన్నత పాఠశాలలో డీఈవో శైలజను కలసి వినతిపత్రం సమర్పించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం. కళాధర్ మాట్లాడుతూ నాడు-నేడు, ఆన్‌లైన్ ట్రైనింగ్, టెన్త్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతుల పేరుతో రాతపూర్వక ఆదేశాలు లేకుండా మౌఖిక ఆదేశాల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. సెలవుల్లో పనిచేసినందుకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఫ్యాప్టో డెప్యూటీ సెక్రటరీ జనరల్ జి. మోహనరావు, ఎండీ. ఖాలీద్, జి. వేళాంగిణిరాజు ఉన్నారు.